క్లుప్తంగా

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

నల్లజర్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల, **పార్డ్ఇండియా** స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం పోతవరంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ జోన్ చైర్‌పర్సన్ దిడ్ల యాంజిలో ప్రారంభించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో దాదాపు 100మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 12మందికి ఆపరేషన్లు, మిగతావారికి కళ్లజోళ్లు అవసరమవుతాయని గుర్తించి 12మందిని ప్రత్యేక వాహనంలో వేమగిరికి పంపినట్లు క్యాంపు కన్వీనర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీటీసీ పాపా నాగేశ్వరావు, పార్డ్ ఇండియా నల్లజర్ల శాఖ అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్ షరీఫ్, డాక్టరు బద్రి వీరశేఖర్, సోమిశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం



కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బిరుదుగడ్డ రవీంద్రకు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం రూ.40 వేల ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ బొంతా భరత్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరిశెట్టి రాజేంద్రబాబు చేతుల మీదుగా ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరహరిశెట్టి సుధాకర్, గాడి పెద్దిరాజు, జువ్వల ఆనంద్, గుదే రాజు, పేరూరి చినవీర్రాజు, కర్రి శివారెడ్డి, గుమ్మడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి సాయం

నల్లజర్ల: చీపురుగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలగాని నాగేంద్రకు ఆ గ్రామ జనసేన నాయకుడు వరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రూ.18వేలు సాయం అందజేశారు. ఈమొత్తాన్ని నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు చేతుల మీదుగా అందజేశారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి

నిడదవోలు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి ఎస్.మోహన్‌రావు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం లోహియ నగర్‌లో ఉచిత పశు వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. పాడి రైతులకు మినరల్ మిక్చర్, డీ వార్మింగ్ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోగిన శ్రీనివాసరావు, ఉప్పులూరి రామ్మోహన్‌రావు, ఎండీ అక్రం, తమ్మిరెడ్డి శ్రీనివాస్, వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి జి.సత్యనారాయణ, అసిస్టెంట్‌లు ఎం.సత్తిరాజు, పృథ్వీ, డాని, వసంత్, మధు, పాడి రైతులు పాల్గొన్నారు.

మల్లవరంలో నేడు గాంధీ వర్ధంతి

చాగల్లు: జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో మల్లవరం ఆనంద నికేతన్ సేవా కేంద్రంలో గురువారం గాంధీజీ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ స్మారక నిధి ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శాంతిసేన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కవితా రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయటం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గాంధేయ వాదులు, యువకులు, సేవా సంస్థల నిర్వాహకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే ముప్పిడి పరామర్శ

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంపా నాగేశ్వరరావు భార్య వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా బుధవారం నాగేశ్వరరావును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరామర్శించారు. సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు

వ్యక్తికి గాయాలు

కొవ్వూరు: ఈనెల 26వ తేదీన వేములూరు సంపంగి హోటల్ సమీపంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న కొండ్రి ఆదినారాయణను టాటా ఏసీ వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో దొరయ్య చెరువు కాలనీకి చెందిన ఆదినారాయణ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.

మృత్యు కూడళ్లు..!

- గ్రామ కూడళ్ల వద్ద నిత్యకృత్యమైన రహదారి ప్రమాదాలు
- నిబంధనల పాటింపులో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం
- దశాబ్దాలు గడుస్తున్నా నోచుకోని సెంట్రల్ లైటింగ్
- గ్రామాల వద్ద కానరాని సర్వీసు రోడ్లు
- గడిచిన మూడేళ్లలో 355 ప్రమాదాలు
- 103 మంది మృత్యువాత

పెరవలి: జాతీయ రహదారిని ఆనుకుని ఉండే గ్రామ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన డివైడర్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గ్రామాల్లో ప్రధాన రహదారులు, జాతీయ రహదారికి అనుసంధానం జరిగే చోటే ఈ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. పెరవలి మండలంలో 15 కిలోమీటర్ల మేర విస్తరించిన జాతీయ రహదారిపై పెరవలి, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన ఈ డివైడర్లు మృత్యు కూడళ్లుగా మారాయి. ముఖ్యంగా ఈ కటింగ్‌ల వద్ద రహదారుల మలుపులు ఉండటం వల్ల మరోవైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో రోడ్డు దాటే సమయంలోనే ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అది కూడా ఉదయం, సాయంత్రం సమయాల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి. ఆ సమయాల్లో పొలాలకు వెళ్లే రైతులు, దూర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికులతో రహదారులు రద్దీగా ఉండటం, హడావుడిగా రోడ్డు దాటే సమయంలో వేగంగా వచ్చే వాహనాలకు పలువురు బలవుతున్నారు.

ప్రమాదకర కూడళ్ల గుర్తింపు

పెరవలి మండలంలో గత మూడేళ్ల కాలంలో 355 ప్రమాదాలు జరగగా ఇందులో 225 మంది క్షతగాత్రులుగా మారారు. 103 మంది దుర్మరణం చెందారు. ఈ ప్రమాదాలన్నీ గ్రామ కూడళ్ల వద్దే జరగడం విశేషం. జాతీయ రహదారి ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ వాటి వద్ద ఏర్పాటు చేయవలసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎన్‌హెచ్ అధికారులు ఏర్పాటు చేయక పోవటంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జాతీయ రహదారి 100 కిలోమీటర్ల మేర ఉండగా ఎక్కువగా ప్రమాదాలు ఈ రహదారిపైనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. 2016లో జాతీయ రహదారిపై ప్రమాదాల తీవ్రతపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఆధారంగా జిల్లాలో 16 చోట్ల అత్యంత ప్రమాదకరమైన కూడళ్లను గుర్తించారు. ఇందులో 6 చోట్లు ఒక్క పెరవలి మండలంలోనే ఉన్నాయని తెలియటంతో అధికారులు అందుకు తాత్కాలిక చర్యలు తీసుకొని వదిలేశారు. అప్పట్లో గ్రామ కూడళ్ల వద్ద సర్వీస్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించినా నేటికీ అమలు కాలేదు. 2015లో డీజీపీగా పనిచేసిన సాంబశివరావు తూర్పుగోదావరి జిల్లా నుంచి తాడేపల్లి వెళుతుండగా ఖండవల్లి వద్ద ప్రమాదం జరిగింది. వెంటనే స్పందించిన డీజీపీ తానే స్వయంగా కారు దిగి క్షతగాత్రులను తన కారులో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ జాతీయ రహదారిపై నిత్యం ఏదో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

గడిచిన మూడేళ్లలో ప్రమాదాలు ఇలా..

పెరవలి మండల పరిధిలో జాతీయ రహదారిపై గత మూడేళ్లలో జరిగిన ప్రమాదాల కారణంగా 103 మంది మృతి చెందారు. 2021–22లో 41 మంది మృతి చెందగా, 2022–23లో 43 మంది, 2023–24లో ఇప్పటి వరకు 19 మంది మృతి మృత్యువాత పడ్డారు. ఇందులో అధికారికంగా పోలీసు రికార్డుల్లో నమోదైనవి కొన్ని మాత్రమే ఉండగా నమోదు కాని కేసులు ఎన్నో ఉన్నాయి.



ఖండవల్లి సెంటర్‌లో సర్వీస్ రోడ్డుకు నోచుకోని కూడలి



పెరవలి వద్ద ప్రమాదకరంగా మారిన జాతీయ రహదారి కూడలి



అన్నవరప్పాడు వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయని కూడలి

నిబంధనలకు తూట్లు

జాతీయ రహదారి నిర్మాణంలో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామ కూడళ్ల వద్ద డివైడర్లు(రోడ్డు కటింగ్‌లు) ఏర్పాటు చేసినప్పుడు గ్రామం నుంచి వచ్చే రహదారులకు స్పీడ్ బ్రేకర్లు నిర్మించాల్సి ఉన్నా ఎక్కడా వాటిని ఏర్పాటు చేయలేదు. పాదచారులు, వాహనదారుల కోసం జీబ్రా గుర్తులను వేయాల్సి ఉన్నా వాటినీ ఏర్పాటు చేయలేదు. డివైడర్ల వద్ద ప్రమాద హెచ్చరికలు తెలిపే బొమ్మలు వేయాల్సి ఉన్నా వాటినీ ఏర్పాటు చేయలేదు. వాహనాల వేగాన్ని తగ్గించే స్పీడు కంట్రోల్ స్టాప్ బోర్డులు లేవు.కూడళ్ల వద్ద సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేసి అందుకు అనుగుణంగా ఐరన్ మెస్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటితో పాటు గ్రామ కూడళ్ల వద్ద సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయాలని నిబంధనలు చెబుతున్నా అధికారులు ఎక్కడా పాటించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రోడ్డు దాటాలంటే భయమేస్తోంది

జాతీయ రహదారిని దాటి వెళ్లాలంటే భయమేస్తోంది. వాహనాల వేగానికి ఒక్కోసారి చాలా సమయం రహదారి ఆవలనే ఉండాల్సి వస్తోంది. గ్రామ కూడళ్ల వద్ద ఎన్నో ప్రమాదాలు కళ్లారా చూశాం.

గిద్దా ఏడుకొండలు, అన్నవరప్పాడు

అధికారులు స్పందించాలి

జాతీయ రహదారిపై నిత్యం ప్రయాణం చేయవలసిన పరిస్థితి. వాహనాల వేగానికి హడలి పోతున్నాం. జాగ్రత్తగా వెళుతున్నా రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. సైడ్ రోడ్డులు లేవు. ఇప్పటికీ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయలేదు.

బొకే వెంకటేశ్వర్లు, ఖండవల్లి.

ప్రమాదాల నివారణపై దృష్టి

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గ్రామ కూడళ్ల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేశాం. గ్రామాల వద్ద సెంట్రల్ లైటింగ్ కోసం ఎన్‌హెచ్ అధికారులను సంప్రదించాం. జనం రద్దీగా ఉన్న పెరవలి, ఖండవల్లి గ్రామాల వద్ద నిత్యం పహారా ఉండేలా ఏర్పాట్లు చేశాం.

వెంకటేశ్వరరావు, ఎస్సై, పెరవలి.

వార్డు సభ్యురాలు అదృశ్యంపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: మండలంలోని కంసాలిపాలెం గ్రామానికి చెందిన 5వ వార్డు సభ్యురాలు గరగా నాగలక్ష్మి(40) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీన కిరాణా సరుకులు తీసుకు వస్తానని ఇంటి నుంచి నిడదవోలు వెళ్లిన తన భార్య నాగలక్ష్మి తిరిగి రాలేదని బుల్లియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

ఉండ్రాజవరం: గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యురాలు ఉషాదేవి అన్నారు. మండలంలోని వడ్లూరు గ్రామంలో పోషణ్ వాటిక కార్యక్రమంలో భాగంగా పండించిన ఆకు కూరలను వీరికి బుధవారం పంపిణీ చేశారు. పెరవలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉండ్రాజవరం–2 సెక్టార్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. వీఆర్వో వీరభద్రరావు, ఏఎన్ఎంలు ఈ.వెంకటలక్ష్మి, రజిని, పి.వెంకటలక్ష్మి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు స్వర్ణకుమారి, కె.పద్మావతి, కె.లక్ష్మి, ఎస్.సుందరి, అంగన్వాడీ సహాయకులు పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు రెండు మద్యం దుకాణాల కేటాయింపు

కొవ్వూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని చాగల్లు, తాళ్లపూడి మండలాలకు ఒక్కోటి చొప్పున మద్యం దుకాణాలను కల్లు గీత కార్మికులకు కేటాయించినట్లు సీఐ కె.సత్యనారాయణ తెలిపారు. బీసీ శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందిన వారికి రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చునని తెలిపారు. ఆరో తేదీన వచ్చిన దరఖాస్తుల పరిశీలన చేసి ఏడో తేదీ ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి లక్కీ డ్రా నిర్వహిస్తారని తెలిపారు.

సామాజిక సేవలను విస్తృతం చేయాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం

కొవ్వూరు: రానున్న రోజుల్లో వాసవీ క్లబ్ ద్వారా మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు క్లబ్ సభ్యులు శ్రద్ధ తీసుకోవాలని వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ దర్శి శ్రీనివాస గుప్తా సూచించారు. వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్లబ్ ద్వారా గత ఏడాది చేసిన సేవా కార్యక్రమాల గురించి ప్రస్తుత అధ్యక్షుడు దేవాతు కృష్ణ ప్రసాద్ వివరించారు. నూతన అధ్యక్షుడిగా మన్యం వీరభద్ర గుప్తా, కార్యదర్శిగా సత్యవరపు గురునాథ్, కోశాధికారిగా సత్యవరపు భరత్‌కుమార్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ వలివేటి ప్రసాద్, జిల్లా గవర్నర్ చల్లగంట్ల వెంకటేశ్వరరావు, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యవరపు గోపాలకృష్ణ, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ గ్రంధి గంగాధర ప్రవీణ్, జోన్ చైర్మన్ కాకి అనిల్ సూర్య, ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మట్టే వీర వెంకట వరప్రసాద్, కొల్లేపర శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు మద్దుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన రద్దు

కొవ్వూరు: పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ శాసన మండలి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఫిబ్రవరి ఒకటో తేదీన ఖరారైన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన రద్దయినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో సీఎం పర్యటన అన్నమయ్య జిల్లాకు మార్చారని తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు వెల్లడించారు.

కౌన్సిలర్‌కు అస్వస్థత

నిడదవోలు : స్థానిక 19వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ అహ్మదున్నీషాబేగం బుధవారం అస్వస్థతకు గురయ్యారు. కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యేందుకు ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి ఆమె వచ్చారు. కౌన్సిల్ సమావేశ మందిరానికి వెళుతున్న సమయంలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురి కావడంతో వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ మెరుగైన వైద్య సేవలందించడంతో కోలుకున్నారు. మునిస్పల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు ఆసుపత్రికి వెళ్లి అహ్మదున్నీషాబేగం ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు.

దొండ సాగు.. లాభాలు బాగు

పెరవలి: దొండకాయల ధరలు తగ్గుతూనే ఉన్నా రైతులకు లాభాలను తెచ్చి పెడుతున్నాయి. దిగుబడి పెరగటంతో పాటు గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతులు లాభాల బాట పడుతున్నారు. ఖండవల్లి దొండ మార్కెట్‌లో బుధవారం 10 కిలోల దొండకాయలు రూ.190 ధర పలకటంతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. ఒక ఎకరం దొండ పాదుల నుంచి దిగుబడి 300 నుంచి 500 కిలోలు రావటంతో రైతులకు రవాణా, ఇతర ఖర్చులు పోనూ కోతకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు మిగులు వస్తుందని చెబుతున్నారు. నెల రోజుల క్రితం వరకు 10 కిలోల దొండకాయలు రూ.300 ధర పలికితే నేడు అది రూ.190కు చేరింది. నాడు దిగుబడి లేదని నేడు దిగుబడితో పాటు గిట్టుబాటు ధర సైతం వస్తున్నదని రైతు పంతం రాంబాబు తెలిపాడు.



ఎగుమతికి సిద్ధం చేస్తున్న దొండకాయల బస్తాలు

వచ్చేనెల 8 నుంచి రామలింగేశ్వస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీ ఉమా అక్షయ రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ఫిబ్రవరి 6,8,10వ తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ మూడు రోజుల పాటు ఆలయం వద్ద ప్రత్యేక యాగశాలలో పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

కోటసత్తెమ్మ ఆలయ పరిశీలన

నిడదవోలు రూరల్: కోటసత్తెమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ ఇంజినీరింగ్ అధికారుల బృందం బుధవారం పరిశీలించారు. ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కోటసత్తెమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయంలో పర్యాటక శాఖ ఇంజినీరింగ్ అధికారులు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు: పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన మైనర్ యువతి అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు.తన కుమార్తె రాజమహేంద్రవరం ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోందని 28వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రించిందని, తెల్లవారు చూసేసరికి కనిపించలేదని యువతి తల్లి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. గౌరీపట్నం గృహ, వాణిజ్య, వ్యవసాయ, ఇండస్ట్రియల్ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందని ఆయన తెలిపారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

నిడదవోలు : పట్టణంలో దోమల వ్యాప్తి, వీధి కుక్కల సంచారంపై కౌన్సిల్ సభ్యులు మూకుమ్మడిగా గళమెత్తారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ముందుగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వాడీవేడిగా జరిగిన సాధారణ సమావేశంలో కొన్ని అంశాలపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వాటిని రద్దు చేశారు. సాధారణ సమావేశంలో 35, అత్యవసర సమావేశంలో ఐదు అంశాలను కౌన్సిల్ ఆమోదించింది.

అక్రమ కట్టడాలపై చర్యలేవీ..

పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ కట్టడాలపై ఏం చర్యలు తీసుకున్నారని కౌన్సిలర్ పువ్వల రద్దీదేవి అధికారులను నిలదీశారు. ప్రధాన సెంటర్లలో 100, 120 అడుగుల రోడ్డులను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆమె సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి ఎస్.సుప్రియ సమాధానమిస్తూ సిబ్బందితో ఫీల్డ్ విజిట్ చేస్తూ అక్రమ కట్టడాలపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని చెప్పారు. సరైన ప్లాన్ లేకుండా నిర్మించిన కట్టడాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



సమావేశంలో సమస్యలపై ప్రశ్నిస్తున్న మహిళా కౌన్సిలర్లు

దోమలు వ్యాప్తిపై మండిపడ్డ సభ్యులు

పట్టణంలో పారిశుద్ధ్య లోపంతో దోమలు వ్యాప్తి చెందాయని నివారణకు ఫాగింగ్ చేయడం లేదంటూ కౌన్సిల్ సభ్యులు అధికారులపై మండిపడ్డారు. కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, కామిశెట్టి వెంకట సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరా బేగం, ఆలమూరు భారతీలు మాట్లాడుతూ పట్టణంలో దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. పట్టణంలో వీధి కుక్కల సంచారం కూడా ఎక్కువైందని, పట్టణ పురవీధుల్లో పశువులు విచ్చలవిడిగా తిరుగుతున్నా చీమకుట్టినట్లుగా ఉండడం లేదని వారు అధికారులను నిలదీశారు. దీనిపై చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ దోమల నివారణకు రెండు రోజుల్లో ఫాగింగ్ చేయించాలని ఆయన అధికారులను ఆదేశించారు. పలువురు కౌన్సిలర్లు తమ పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు.

వైట్ ఫీల్డ్ భూముల పరిశీలన

తాళ్లపూడి: మండలంలోని బయ్యరంలో వైట్‌ఫీల్డ్ పేపర్ మిల్లుకు గతంలో కేటాయించిన భూములను బుధవారం జేసీ చిన రాములు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, ఎమ్మెల్యే ముప్పడి వెంకటేశ్వరరావులు బుధవారం పరిశీలించారు. 32 సర్వే నెంబర్‌లో 230 ఎకరాల భూమిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో వైట్‌ఫీల్డ్ సంస్థకు కేటయించారు. అప్పటి ప్రభుత్వం కేటాయించిన ఈ భూములను తర్వాత స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూముల వ్యవహారం కోర్టులో ఉంది. అయితే అధికారులు మళ్లీ ఈ భూములు పరిశీలించడంతో కొత్త పరిశ్రమ వచ్చే అవకాశం ఉందని అనుకుంటున్నారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ భారతి, వీఆర్వోలు నాగేశ్వరరావు, లీలావతి తదితరులున్నారు.



బయ్యరం వద్ద భూములు పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీవో, ఎమ్మెల్యేలు

తహసీల్దారు కార్యాలయాన్ని నిర్మించాలి

నిడదవోలు : స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కనే అసంపూర్తిగా నిలిచిపోయిన తహసీల్దారు కార్యాలయ నిర్మాణ పనులను చేపట్టాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. అసంపూర్తిగా నిలచిపోయిన పనుల వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దారు కార్యాలయాన్ని నూతన ఆర్వోబీ నిర్మాణం కోసం వేరొక ప్రాంతానికి మార్చే పరిస్థితి రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణం పనులు ప్రారంభించాలన్నారు.

30న జాబ్‌మేళా

కొవ్వూరు: ఈ నెల 30వ తేదీన కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి హరీష్ చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పెరుమశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు రెండు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డీ ఫార్మసీ, డిగ్రీ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల వయస్సులోపు యువతీ, యువకులు అర్హులన్నారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రెజ్యూమ్‌తో పాటు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

దేవరపల్లి: దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం శివారు సుబ్బరాయపురంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మూడు బాధిత కుటుంబాలకు యర్నగూడెం బొల్లిన గంగరాజు జెడ్పీ హైస్కూలు 2002–05 బ్యాచ్ పూర్వ విద్యార్థుల హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మంగళవారం సాయంత్రం నిత్యావసర సరుకులు, ఆర్థికసాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి 20 కిలోల బియ్యం, నిత్యావసరాలు, నగదు సాయం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తిరుపతి ప్రసాద్, కార్యదర్శి కావాలిపురపు బాలకృష్ణ, సభ్యులు రొక్కం శ్రీను, గమ్మతనుజ, కొంజర్ల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

